# సాక్షి సంగారెడ్డి

మంగళవారం ׀ 29 ׀ ఏప్రిల్ ׀ 2025




## ఫాం రోబో

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం హోతి(కె) గ్రామంలో ఫాం రోబో డెమో నిర్వహించారు. ఓ కంపెనీ తన ఉత్పత్తులకు సంబంధించి రైతులకు డెమో నిర్వహించింది. ఈ సందర్భంగా రిమోట్ కంట్రోల్ ద్వారా పనిచేసే మినీ ట్రాక్టర్‌కు మందులను పిచికారి చేసే యంత్రంతో పాటు రోటవేటర్, బేస్ కటర్‌లను అమర్చి వాటి పనితీరును ప్రదర్శించారు. చెరకు తోటలో రోటవేటర్, కలుపును తొలగించే బేస్ కటర్లను ప్రదర్శించారు. ప్రదర్శనను రైతులు ఆసక్తితో తిలకించారు.

- జహీరాబాద్



మినీ ట్రాక్టర్‌తో మందులను పిచికారి చేసే విధానంపై నిర్వహించిన ప్రదర్శన

## న్యూస్‌రీల్

### ఇది ఆరంభం మాత్రమే

**రజతోత్సవ సభ చరిత్రలో నిలుస్తుంది: చింతా**



సంగారెడ్డి: ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ చరిత్రలో నిలిపోతుందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సభకు తరలి వచ్చిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఇది ఆరంభం మాత్రమేనని, మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు.

### ప్రతిభకు పురస్కారం

**ఇంటర్ విద్యార్థిని సన్మానించిన కలెక్టర్**



విద్యార్థిని సన్మానిస్తున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి జోన్: ఇటీవల విడుదలైన ఇంటర్మీడియెట్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని అక్షయను కలెక్టర్ వల్లూరు క్రాంతి సన్మానించారు. సోమవారం తన కార్యాలయంలో శాలువాతో సత్కరించి మిఠాయిలు తినిపించారు. 1000 మార్కులకు గాను 977 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా అక్షయ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో డాక్టరు అయ్యి వైద్యురాలిగా సేవలు అందింటమే తన లక్ష్యం అని పేర్కొన్నారు.

### త్వరితగతిన అర్జీల పరిష్కారం

**అదనపు కలెక్టర్ చంద్రశేఖర్**



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, చిత్రంలో డీఆర్ఓ పద్మజరాణి తదితరులు

సంగారెడ్డి జోన్: ప్రజావాణిలో ఎప్పటిలాగే సోమవారం అర్జీలు సమర్పించారు. సోమవారం కలక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్ఓ పద్మజారాణి అధికారులు అర్జీలను స్వీకరించారు. తమ సమస్యలు పరిష్కరించాలని అధికారులతో వేడుకున్నారు. కలెక్టరేట్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని వారు వాపోయారు. అర్జీలను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కాగా, ప్రజావాణికి సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో జనం ఇబ్బందిపడ్డారు. మహిళలు, పురుషులకు ఒకే క్యూ లైన్ ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు పడ్డారు. కూర్చునేందుకు సరైన విధంగా వసతి కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. దివ్యాంగులు సైతం తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

### విధి నిర్వహణలో నిర్లక్ష్యం ఇద్దరు అధికారులపై వేటు

సంగారెడ్డి జోన్: నారాయణఖేడ్ నియోజకవర్గం కల్హేర్ మండలానికి చెందిన ఇద్దరు అధికారులపై వేటు పడింది. ఈ మేరకు సోమవారం కలెక్టర్ వల్లూరు క్రాంతి ఉత్తర్వులు జారీ చేశారు. కల్హేర్ మండల డిప్యూటీ తహసీల్దార్ బీటీ పవన్‌కుమార్, జహీరాబాద్ మండలంలో గిర్దావర్ యాదిలాల్‌ను సస్పెండ్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఫిర్యాదులు రావటంతో వారిద్దరిపై విచారణ జరిపించారు. విచారణాధికారి సమర్పించిన నివేదిక ఆధారంగా కలెక్టర్ వారిద్దరిపై వేటు వేశారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.

### పరిశ్రమలపై ఫిర్యాదు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం పారిశ్రామికవాడలోని ఆక్రన్ పరిశ్రమ యజమాన్యం విచ్చలవిడిగా రసాయన గణ వ్యర్థాలను విజయ శ్రీ పరిశ్రమ సమీపంలో పారబోస్తుంది. స్థానిక నాయకుడు వెంకటయ్య సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌ను కలిసి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పరిశ్రమ వ్యవహరిస్తున్న తీరుపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

### మే 20న దేశవ్యాప్త సమ్మె

జహీరాబాద్ టౌన్: మే 20 నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ పేర్కొన్నారు. పట్టణంలోని శ్రామిక్ భవనంలో సోమవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి అన్యాయం చేసిందన్నారు. కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందన్నారు. వీటిని రద్దు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా నిర్వహించినున్న సమ్మెలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు రాజిరెడ్డి, గౌరమ్మ, నారాయణ, యశోదమ్మలు పాల్గొన్నారు.

# భూములు లాక్కుంటే మేమెట్లా బతకాలి..?

- గుమ్మడిదలలో ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటుకు సర్కార్ నిర్ణయం
- భూసేకరణ వేగవంతం చేసిన అధికారులు
- భూమికి భూమి ఇవ్వాలి.. లేదా ప్రత్యామ్నాయం చూపాలి
- బాధిత రైతుల డిమాండ్



గ్రామ సభలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రవీందర్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో కాలుష్యరహిత ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటు నిర్ణయం రైతులకు కునుకు లేకుండా చేస్తోంది. గుమ్మడిదలలో సర్వే నంబర్ 109లో 157.29 ఎకరాలలో ఈ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. భూసేకరణ విషయమై అధికారులు దూకుడు పెంచారు. ఇటీవల గ్రామ సభను ఏర్పాటు చేశారు. టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ రతన్ రాథోడ్, ఆర్డీవో రవీందర్ రెడ్డి భూసేకరణపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. అయితే.. భూములు తీసుకుంటున్న అధికారులు.. భూమికి బదులు భూమి ఇస్తారా..? లేక ఇంకేమైనా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూపుతారా? అనేది ప్రకటించలేదు. దీంతో బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. ''మా తాతల కాలం నుంచి భూములను నమ్ముకొని బతుకుతున్నాం. ఇప్పుడు ఇండస్ట్రీయల్ పార్కు పేరిట మా భూములను లాక్కొనేందుకు ప్రయత్నిస్తున్నారు. భూములు లాక్కుంటే మేం ఎట్లా బతకాలి. భూమికి భూమి ఇవ్వాలి. లేదా అన్నారం పరిధిలోని సర్వే నంబర్ 261లో వెయ్యి గజాలు చొప్పున పట్టాలు చేసి ఇవ్వాలి''అని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇన్నేళ్లుగా బతుకుదెరువునిచ్చిన భూములను అప్పగించేందుకు మాత్రం వారు వెనుకడుగు వేస్తున్నారు.

### భూమికి భూమి ఇవ్వాలి



ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం రైతులకు భూమికి భూమి ఇచ్చి న్యాయం చేయాలి. ఎన్నో ఏళ్లుగా ఈ భూముల్లో ఉపాధి పొందుతున్నాం. ఇప్పుడు పారిశ్రామిక వాడ ఏర్పాటు పేరిట రైతుల భూములు సేకరిస్తున్న ప్రభుత్వం .. బాధిత రైతులకు న్యాయం చేయాలి.

రవీందర్, రైతు, గుమ్మడిదల

### వ్యవసాయ భూములు లాక్కోవద్దు



ఎన్నో ఏళ్లుగా మేమంతా భూములు సాగు చేసుకుంటూ బతుకుతున్నాం. ఇప్పుడు ప్రభుత్వం పార్కు పేరిట మా భూములు కావాలంటుంది. ముందుగా మాకు ఏం న్యాయం చేస్తారో చెప్పాలి. వేరేచోట భూములు ఇచ్చినా సరే.. లేదంటే రోడ్డున పడతాం.

భద్రయ్య, రైతు, గుమ్మడిదల

### బాధిత రైతులకు న్యాయం చేస్తాం

గుమ్మడిదల మున్సిపాలిటీలో గ్రీన్, ఆరెంజ్ జోన్లో ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని ఆర్డీవో రవీందర్ రెడ్డి అన్నారు. ఈ ప్రాంతంలో పార్కు ఏర్పడితే కాలుష్య రహిత పరిశ్రమలను స్థాపిస్తామని, తద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో అభివృద్ధికి కేంద్రబిందువుగా ఉంటుందన్నారు. భూములు కోల్పోయే రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా న్యాయం చేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.

- ఆర్డీఓ రవీందర్ రెడ్డి

# మొక్కలేని సంకల్పం!



మొక్కలు లేకుండా ఖాళీగా కనిపిస్తున్న మట్టి బ్యాగులు హత్నూర మండలం మధుర గ్రామ నర్సరీలోని చిత్రమిది. సరైన సమయంలో బ్యాగుల్లో విత్తనాలు వేయకపోవడం, అవసరం మేరకు నీళ్లు పట్టకపోవడంతో సగానికి పైగా మొక్కలు మొలకెత్తలేదు. నిజానికి ఒక్కో బ్యాగులో రెండేసి విత్తనాలు వేస్తారు. ఒకటి మొలక రాకపోయినా.. ఇంకో విత్తనం మొలకెత్తుతుంది. కానీ నిర్వహణ లోపం కారణంగా బెడ్లలో సగానికిపైగా బ్యాగులు ఖాళీగా ఉన్నాయి. ఇది ఒక్క మధుర గ్రామంలోని నర్సరీదే కాదు.. జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు నర్సరీల్లోనూ ఇదే పరిస్థితే నెలకొంది.

– సాక్షిప్రతినిధి, సంగారెడ్డి

- జర్మినేషన్ 11 శాతం తగ్గిందంటున్న అధికారులు
- 40 శాతానికి మించి నాటుకోలేదని అనధికారిక అంచనా
- నర్సరీల నిర్వహణను గాలికొదిలేసిన గ్రామ కార్యదర్శులు
- వనమహోత్సవానికి మొక్కలు సిద్ధం కావడం ప్రశ్నార్థకమే

నర్సరీల్లో మొక్కల పెంపకం విషయంలో సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఏటా డిసెంబర్ చివరి వారం వరకు పాలిథిన్ కవర్లలో మట్టిని నింపి (బ్యాగ్ ఫిల్లింగ్) చేసి విత్తనాలు పెట్టుకుంటే జర్మినేషన్ 100 శాతం ఉంటుంది. కానీ అప్పట్లో గ్రామపంచాయతీల కార్యదర్శులకు సర్వే, ఇతర పనుల పేరుతో ఈ నర్సరీలను పట్టించుకోలేదు. డిసెంబర్ నెలాఖరులోగా విత్తుకోవాల్సి ఉండగా, చాలా నర్సరీల్లో ఫిబ్రవరి మొదటి వారం వరకు కూడా విత్తనాలు వేసుకోలేదు. ఇప్పుడు మొక్కల జర్మినేషన్ తగ్గడానికి ఆలస్యంగా విత్తుకోవడమే కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు ఈ నర్సరీల నిర్వహణను కూడా కొన్ని గాలికొదిలేయడంతో ఈ పరిస్థితి నెలకొందనే వాదన కూడా ఉంది.

### గతంలో మాదిరిగానే..

గత ప్రభుత్వ హయాంలో హరితహారం పేరుతో ఏటా వర్షాకాలంలో విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టింది. ఏటా లక్షల్లో మొక్కలు నాటినప్పటికీ.. వందల్లో కూడా మొక్కలు పెరగకపోవడంతో ప్రజాధనం చాలా మట్టుకు వృథా అయింది. ఇప్పుడు ఈ ప్రభుత్వం కూడా వనమహోత్సవం పేరుతో వర్షాకాలం రాగానే మొక్కలు నాటే కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. అయితే గత ప్రభుత్వ మాదిరిగానే ఇప్పుడు కూడా సరైన నిర్వహణ లోపం కారణంగా ప్రజాధనం వృథా అవుతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**38 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం కాగా..**

వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈ వర్షాకాలంలో జిల్లా వ్యాప్తంగా 38 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న 619 చోట్ల ఉన్న నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని చేపట్టారు. ఇందులో సుమారు 19 లక్షల మొక్కల కోసం కొత్తగా విత్తనాలు వేసుకోగా, గత ఏడాది నాటకుండా మిగిలిపోయిన మరో 19 లక్షల మొక్కలను ఈ ఏడాదికి సిద్ధంగా ఉంచుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే జర్మినేషన్ తగ్గడంతో ఈసారి వనమహోత్సవానికి సరిపడా మొక్కలు పెరగడం ప్రశ్నార్థకంగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### సరిపోను మొక్కలను సిద్ధం చేస్తున్నాం



ఈ ఏడాది వన మహోత్సవ కార్యక్రమానికి 38 లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యంగా ప్రణాళికను రూపొందించాం. ఈ మేరకు నర్సరీల్లో మొక్కలను పెంచుతున్నాం. అయితే ఈసారి కొన్ని నర్సరీల్లో మాత్రమే జర్మినేషన్ తగ్గినట్లు మా దృష్టికి వచ్చింది. వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకున్నాం. లక్ష్యానికి సరిపోను మొక్కలను సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- మణికుమార్, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్

# చిరు ధాన్యాల భాండాగారం

- 40 గ్రామాల మహిళా రైతుల విత్తనాల ప్రదర్శన
- డీడీఎస్ సంఘాల సభ్యులు చిరుధాన్యాలే సాగు

**నేటి నుంచి విత్తన వారోత్సవాలు**



చిరుధాన్యాల విత్తనాలు

జహీరాబాద్: మహిళా రైతులు తమ పొలాల్లో నాటుకునేందుకు సొంత విత్తనాలే వాడుతారు. పంట చేతికి రాగానే అందులోని నాణ్యమైన పంటను విత్తనంగా సేకరించి నిల్వ పెట్టుకున్నారు. విత్తనాలు వేసే సమయానికి వాటిని బయటకు తీస్తారు. జహీరాబాద్ డివిజన్ పరిధిలోని జహీరాబాద్, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, మొగుడంపల్లి, రాయికోడ్ మండలాల్లోని సుమారు 70 గ్రామాల్లో డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ(డీడీఎస్) సంఘంలోని మహిళా రైతులు తమకు అవసరమైన మేరకు ప్రతి ఏటా చిరుధాన్యాల విత్తనాలు నిల్వ పెట్టుకుంటారు. ఎంపిక చేసుకున్న విత్తనాలకు పురుగు పట్టకుండా ఉండేందుకు గాను బూడిద, వేపాకు కలిపి ఈత బుట్టల్లో పోసి మట్టితో మూసి వేస్తారు. విత్తనాలు పెట్టే సమయంలో వాటిని బయటకు తీసి ఉపయోగిస్తారు. సుమారు 50 నుంచి 70 రకాల వరకు విత్తనాలను నిల్వచేసి పెట్టుకుంటారు. సాయిజొన్న, పచ్చజొన్న, తీపి జొన్న, గుండు జొన్న, తోక జొన్న, సజ్జ, కొర్ర, తైద, సామ, శనగ, ఆర్గులు, పెసర, మినుము, అవిశ, కందులు, కోడి సామ, ఎవ్వలు ఇలా అనేక రకాల విత్తనాలను సేకరించి పెట్టుకుంటారు. ఆయా పంటలన్నీ వర్షాకాలంలో వర్షాధారంగా, యాసంగిలో తేమ ఆధారంగా పండే పంటలను సాగు చేసుకుంటారు.

**నేడు ప్రపంచ విత్తన వారోత్సవం**

29న (మంగళవారం) డీడీఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ విత్తన వారోత్సవాలను నిర్వహించనున్నారు. ఏప్రిల్ చివరి వారాన్ని ప్రపంచ వ్యాప్తంగా విత్తన వారోత్సవంగా జరుపుకొంటారు. అందులో భాగంగా జహీరాబాద్ మండలంలోని పస్తాపూర్ గ్రామంలోని డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ(డీడీఎస్) ఆధ్వర్యంలో ఉ. 11.30 గంటలకు మహిళా సంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 40 గ్రామాల నుంచి మహిళా రైతులు తమ వద్ద ఉన్న పలు రకాల చిరుధాన్యాల విత్తనాలను ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా ఎంపికయిన ఉత్తమ రైతులకు బహుమతులను అందజేస్తారు.

### మాచ్‌నూర్‌లో విత్తన బ్యాంకు

ఝరాసంగం మండలంలోని మాచ్‌నూర్ గ్రామంలో డీడీఎస్ ఆధ్వర్యంలో చిరు ధాన్యాల విత్తన బ్యాంకును నిర్వహిస్తున్నారు. ఈ విత్తన బ్యాంకులో 60 రకాల వరకు విత్తనాలు రైతులకు అన్ని రకాలు కలిపి సుమారు 20 క్వింటాళ్ల మేర అందుబాటులో ఉంచుతారు. అవసరం అయిన రైతులు విత్తన బ్యాంకును సంప్రదించి విత్తనాలు పొందుతారు. పంట చేతికి రాగానే విత్తన బ్యాంకులో రైతులు తీసుకున్న విత్తనాన్ని తిరిగి అందజేస్తారు. 10 కిలోల విత్తనం పొందితే తిరిగి ఇచ్చే సమయంలో 15 కిలోలు అప్పజెప్పుతారు.



నిల్వ చేసేందుకు విత్తనాల్లో బూడిద కలుపుతున్న మహిళా రైతు (ఫైల్)



భూభారతి చట్టం అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, చిత్రంలో ఎంపీ రఘుందన్, కలెక్టర్ క్రాంతి తదితరులు

# 100 శాతం పరిష్కారం

- భూభారతితో రైతులకు మేలు
- అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించం
- ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ
- చట్టంలో కొన్ని సవరణలు చేయాలి
- ఎంపీ రఘునందన్ రావు

హత్నూర(సంగారెడ్డి): భూ సమస్యల పరిష్కారం విషయంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. సోమవారం హత్నూర మండలం దౌల్తాబాద్‌లో భూభారతి చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కేసీఆర్ తెచ్చిన ధరణి వల్ల ఎంతో మంది రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తమ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని, వంద శాతం భూముల సమస్యల పరిష్కారం కోసం ఈ చట్టం పనిచేస్తుందన్నారు. భూదాన్ చట్టం కూడా సరిచేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంన్నారు. ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ.. భూభారతి చట్టంలో కొన్ని సవరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. భూదాన్ చట్టాన్ని మరింత పటిష్ఠంతో పాటు భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు కృషి చేయాలన్నారు. దేశంలోని సివిల్ కోర్టుల వద్ద ఐదువేల కోట్ల కేసులు పెండింగ్‌లో ఉంటే మూడు వేల కోట్ల కేసులు భూ సమస్యలే ఉన్నాయని ఎంపీ గుర్తు చేశారు. క్షేత్రస్థాయిలో భూ సమస్యలు పరిష్కరిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ.. ఐదు లక్షల విలువ ఉన్న భూమి సమస్యలను ఆర్డీఓ స్థాయిలోనే పరిష్కారం అవుతుందన్నారు. ఉచిత న్యాయ సేవ కూడా రెవెన్యూ శాఖ ద్వారా రైతులకు అందిస్తామన్నారు.

**తహసీల్దార్ కార్యాలయం నిర్మాణానికి శంకుస్థాపన**

మండల కేంద్రమైన హత్నూరలో తహసీల్దార్ నూతన భవన నిర్మాణం పనులకు మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన చేశారు. హత్నూర అంబేద్కర్ గురుకుల కళాశాలలో రూ.63 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీరోడ్లు, రూ.2కోట్లతో నిర్మించిన డార్మెటరీ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమాలలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, టీజీఐసీ చైర్మన్ నిర్మలా రెడ్డి, అదనపు కలెక్టర్ మాధురి, మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సువాసిని రెడ్డి, ఆర్డీవో రవీందర్ రెడ్డి, తహసీల్దార్ పర్వీన్ షేక్, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్, బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, మల్లేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మంత్రి కల్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

### పదేళ్లు సొల్లు కబుర్లు చెప్పావా?

అసెంబ్లీ సమావేశాలను సొల్లు కబుర్లు అని సంబోధించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెంటనే రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని మంత్రి కొండా సురేఖ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు చేశారని విమర్శించారు. అసెంబ్లీని కించపరిచిన కేసీఆర్.. మరి పదేళ్ల మీ పాలనలో సొల్లు కబుర్లు చెప్పారా అంటూ నిలదీశారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు.

# నోటీసులే.. చర్యలేవి..?

- పటాన్‌చెరు, అమీన్‌పూర్‌లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- ఆ భవంతులను కూల్చేస్తాం: కమిషనర్

పటాన్‌చెరు: అమీన్‌పూర్, పటాన్‌చెరు మున్సిపాలిటీల పరిధిలో అక్రమ నిర్మాణాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది,. కొంతమంది అధికారులు నిబంధనల్లో ఉన్న కొన్ని లొసుగులను తమకు అనుకూలంగా మలుచుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పటాన్‌చెరువు, అమీన్‌పూర్ మండలాల పరిధిలోని కొన్ని గ్రామాలను మున్సిపాలిటీల్లోకి విలీనం చేసిన విషయం తెలిసిందే. ఈ సంధి ప్రక్రియలో అక్రమ నిర్మాణలకు అధికారులు వంత పాడుతూ ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నారు. పంచాయతీ కాలంలో పర్మిషన్లు తీసుకున్నామని చెబుతూ.. ఐదంతస్తుల భవంతుల నిర్మాణాలు సాగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. వాస్తవానికి ఆ పంచాయతీల్లో ఇదివరకే డ్రైనేజీలు, రోడ్ల సమస్యలు ఉన్నాయి. బహుళ అంతస్తుల భవనాలు అక్రమంగా పుట్టుకొస్తే రానున్న రోజుల్లో అక్కడ నివసించే ప్రజలు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్న విషయాన్ని అధికారులు పట్టించుకోవడం లేదు. ముత్తంగి, పోచారం, పటేల్‌గూడ, కిష్టారెడ్డిపేట ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పంచాయతీ కాలంలో ఉన్న అధికారులు నేటికీ ఆ ప్రాంతాల్లో చక్రం తిప్పుతున్నారంటే పరిస్థితి ఏ మేరకు ఇట్టే అర్థమవుతుంది. జాతీయ రహదారి పక్కన తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణం జరుగుతున్నా వాటిని ఆపడం లేదు. కిష్టారెడ్డిపేటలో ఔటర్ రింగ్ రోడ్‌కు వెళ్లేదారిలో నిబంధనలను పాటించకుండా సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. ఇదేమిటన ప్రశ్నిస్తే నోటీసులు ఇచ్చాం.. అని చెబుతున్నారు. కానీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇంతకుముందు ఆ గ్రామాల్లో పనిచేసిన కార్యదర్శులు చక్రం తిప్పి మున్సిపల్ అధికారులకు తమకందిన లంచం సొమ్ములో వాటాలిస్తున్నట్టు బహిరంగంగా చర్చ జరుగుతోంది. ముత్తంగి ఔటర్ రింగ్ రోడ్డు జంక్షన్ వద్ద కాల్వలను సైతం కబ్జా చేస్తూ వ్యాపార సముదాయాలు వెలుస్తున్నాయి. పోచారం, ఇంద్రేశం సరిహద్దు ప్రాంతంలో అపార్ట్‌మెంట్లను నిర్మిస్తున్నారు. ముత్తంగిలో పంచాయతీ అనుమతులతో అక్కడ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. వాటికి నోటీసులు ఇచ్చినా ఇంత వరకు చర్యలు తీసుకోవడం లేదు. కిష్టారెడ్డిపేటలో డజన్‌కు పైగా అక్రమ నిర్మాణాలను గుర్తించి వాటికి రెండు పర్యావరణ నోటీసులు ఇచ్చారు. ఇక్కడా అదే పరిస్థితి. విచిత్రమేమిటంటే నోటీసులు ఇచ్చిన వెంటనే తాజా మాజీ కౌన్సిలర్లు, చైర్మన్లు ఆ నిర్మాణాలను వెనకేసుకొస్తున్నారు. ఇటు అధికారులు, రాజకీయ నాయకులు ఒక్కటై అక్రమ నిర్మాణాదార్లకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

### అన్నింటిని కూల్చేస్తాం

నోటీసులు ఇచ్చిన అన్ని భవంతులపై చర్యలు తీసుకుంటామని అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి స్పష్టం చేశారు. త్వరలోనే పోలీసులు, ఇతర శాఖల సమన్వయంగా అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని ఆమె చెప్పారు.

## క్లుప్తంగా

### దశదిన కర్మలో విషాదం

• చెరువులో మునిగి యువకుడు మృతి


హర్షవర్ధన్(ఫైల్)

చేగుంట(తూప్రాన్): ప్రమాదవశాత్తు నీట మునిగి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని బీ.కొండాపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన భాను ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా సోమవారం దశదిన కర్మ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో చెరువులో స్నానాలకు వెళ్లి హర్షవర్ధన్(17) నీటిలో ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. బంధువులు స్థానికులు బయటకు తీసి చికిత్స నిమిత్తం నార్సింగిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చైతన్య కుమార్ రెడ్డి తెలిపారు.

### రెండు బైక్‌లు ఢీ : ఇద్దరికి గాయాలు

తొగుట(దుబ్బాక): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని చందాపూర్ గ్రామానికి చెందిన పడాల స్వామి (35) స్థానిక కో ఆపరేటీవ్ బ్యాంకు నుంచి బైక్‌పై రోడ్డు మీదకి వచ్చాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు బైక్‌పై వెళ్తున్న రాజు స్వామి ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కావడంతో చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### చలాన్ తప్పించుకునేందుకు బైకర్ అత్యుత్సాహం

• కానిస్టేబుల్‌కు గాయాలు, కేసు నమోదు

వెల్దుర్తి(తూప్రాన్) : విధి నిర్వహణలో భాగంగా పోలీసులు వాహన తనిఖీలు చేపడుతుండగా బైకర్ అత్యుత్సాహానికి కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. ఈ ప్రమాదకర ఘటన మండలంలోని బస్వాపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజు కథనం మేరకు.. వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు మండలంలోని బస్వాపూర్ పంచాయతీ పరిధి పంతులుపల్లి గ్రామ శివారులో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. నర్సాపూర్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన బిలాల్ బైక్‌పై చిన్న శంకరంపేట మండలం ధర్పల్లి శివారులోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో పని చేయడానికి వస్తున్నాడు. హెల్మెట్ ధరించకుండా వస్తున్న బిలాల్ పోలీసుల తనిఖీని గమనించి చలాన్ తప్పించుకునేందుకు వేగంగా వెళ్తూ రోడ్డు పక్కన నిల్చున్న కానిస్టేబుల్ సత్యనారాయణపైకి దూసుకెళ్లాడు. దీంతో కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని తూప్రాన్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ఫోన్ మాట్లాడుతుండగా టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

బెజ్జంకి(సిద్దిపేట) : రోడ్డు ప్రమాదంలో వలస కూలీ మృతి చెందిన ఘటన బెజ్జంకి శివారులోని పౌల్ట్రీ ఫామ్ సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మ జిల్లా గుమ్మ గ్రామానికి చెందిన దినేశ్ (18) నెల కిందట స్నేహితుడు సునీల్ బాగ్‌తో కలిసి బెజ్జంకి శివారులోని పౌల్ట్రీ ఫామ్‌కు వచ్చి నిర్మాణం పనులు చేస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి పక్కనే ఉన్న రోడ్డుపై నిలబడి ఫోన్ మాట్లాడుతుండగా బెజ్జంకి వైపునకు వస్తున్న టిప్పర్ డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై దినేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అజాగ్రత్తగా టిప్పర్ నడిపి తన తమ్ముడు మృతికి కారణమైన డ్రైవర్ స్వామి, యజమానిపై చర్య తీసుకోవాలని మృతుడి తమ్ముడు సనాత్‌నాగ్ పోలీసులకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ శంకర్‌రావు తెలిపారు.

### మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, వేములవాడ కమాన్ వద్ద, రాజీవ్ రహదారిపై కొద్ది రోజుల కిందట సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించాం. 9 మంది మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా సోమవారం విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.11,500 జరిమానా, ఇందులో ఒకరికి ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

### అక్రమ కలప స్వాధీనం


అధికారులు పట్టుకున్న డీసీఎం

పెద్దశంకరంపేట(మెదక్): డీసీఎం వాహనంలో అక్రమంగా తరలిస్తున్న కలపను స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వికాస్ సోమవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. టేక్మాల్ మండలం ఎల్లుపేట వైపు నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న అక్రమ కలపను పెద్దశంకరంపేట శివారులో ఆదివారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కొడిపల్లి మండలానికి చెందిన వినోద్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.


తాటి ముంజల బజ్జీలు వేస్తున్న ఆంజనేయులు


బజ్జీలు తింటున్న కస్టమర్లు

# తాటి ముంజల బజ్జీ.. క్రేజీ

• హుస్నాబాద్ నోరూరిస్తున్న బజ్జీలు
• ఇష్టంగా తింటున్న కల్లు ప్రియులు
• రూ.100కి ఆరు చొప్పున విక్రయం
• ఎండాకాలంలో తాటి ముంజలతో శరీరానికి చల్లదనం




తాటి వనం వద్ద ముంజలు అమ్ముతున్న చిరువ్యాపారి

హుస్నాబాద్: బజ్జీలు రకరకాలుగా ఉంటాయి. సామాన్యంగా బజ్జీలు అంటే మిరపకాయ బజ్జీలు, ఆలు బజ్జీలు, హెగ్ బజ్జీలు పేర్లే విన్నాం. ఇక్కడ మాత్రం ముంజకాయల బజ్జీలు ఫేమస్. ఈ బజ్జీలు ఎప్పుడు కావాలంటే అప్పుడు దొరుకవు. కేవలం భగ భగ మండే ఎండాకాలంలో ముంజల సీజన్‌లోనే దొరుకుతాయి. పచ్చి ముంజలతోపాటుగా తాటి ముంజల బజ్జీలను తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నాడు హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామానికి చెందిన ఆంజనేయులు.

హుస్నాబాద్ పట్టణ శివారులోని పందిల్ల రోడ్డామ్ సమీపంలోని హుస్నాబాద్, సిద్దిపేట హైవేలోని తాటి వనంలో ఆంజనేయులు కల్లు తాగే వారి కోసం స్టఫ్ దుకాణం నడిపిస్తున్నాడు. ఇతడు అమ్మే వాటిలో తాటి ముంజల బజ్జీలు ఫేమస్. బజ్జీలు చాలా రుచికరంగా ఉంటాయి. ఆంజనేయులు దగ్గర కల్లు ప్రియులు రోడ్డు నుంచి వెళ్లే వారు కొనుక్కుంటారు. తాటి వనంలో అమ్మే స్టఫ్‌కు బదులుగా ముంజల బజ్జీలను ఎక్కువగా ఇష్టపడి తింటుంటారు. ఈ తాటి ముంజలను శనగపిండిలో కారం, ఉప్పు, సోడా వేసి కలుపుతాడు. తర్వాత ముంజలను పిండిలో ముంచి నూనె కడాయిలో వేస్తాడు. సామాన్యంగా బజ్జీలను ఎలా తయారు చేస్తారో అదే విధంగా ముంజలను బజ్జీలుగా తయారు చేస్తాడు. ఎర్రగా బాగా కాలిన తర్వాత బజ్జీలను తీసి అమ్ముతుంటాడు. రూ.100కి ఆరు చొప్పున అమ్ముతాడు. మోదుగాకులో పెట్టి మరీ ఇస్తాడు. కల్లు ప్రియులు కల్లు తాగుతూ లోట్టలు వేసుకుంటూ తింటున్నారు. కల్లు తాగని వారు ఇంటికి తీసుకెళ్తారు. ఆర్డర్ పై కూడా ముంజల బజ్జీలు తయారు చేసి ఇస్తున్నాడు ఈ ఆంజనేయులు.

**ముంజుల విక్రయం ఎక్కువే..**

ఎండాకాలంలో పండ్ల రసాలు, జ్యూస్‌లు, నిమ్మరసం తాగితే శరీరానికి మంచిది. కడుపులో చల్లగా ఉంటుంది. ఈ రసాలు ఏ కాలంలోనైనా దొరుకుతాయి. కానీ ఎండాకాలంలో తాటి ముంజకాయలకు భలే గిరాకీ ఉంటుంది. తాటిముంజలు తింటే శరీరంలో వేడిని తగ్గిస్తుంది. కడుపులో చల్లగా ఉండి శరీరానికి మంచిదని చాలా మంది తాటి ముంజలను అమితంగా ఇష్టపడుతారు. చిరు వ్యాపారులు తాటి గెలలను గీత కార్మికుల నుంచి కొనుగోలు చేసి ముంజలు తీసి అమ్ముతుంటారు. రూ.100కి 12 చొప్పున విక్రయిస్తుంటారు.

## మద్యం మత్తులో ఉరేసుకొని ఆత్మహత్య


శేఖులు(ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్) : తాగుడుకు బానిసై మద్యం మత్తులో గ్రామ పంచాయతీ కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాదకర ఘటన వెల్దుర్తి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజు కథనం మేరకు.. గ్రామానికి చెందిన ముల్క శేఖులు(55) కొన్నేళ్లుగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసై రోజు తాగుతున్నాడు. ఆదివారం రాత్రి మద్యం సేవించి ఇంటికి రాగా మద్యం తాగడం మానేయాలని, రోజూ తాగితే కుటుంబం గడిచేదెలా అంటూ భార్య సునీత అడిగింది. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కొద్ది సేపటి తర్వాత ఇంటి నుంచి బయటకు వెళ్లిన శేఖులు తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం వెతుకుతుండగా పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలోని చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. తాగుడుకు బానిసై, మద్యం మత్తులో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

**కరీంనగర్ గ్రామంలో యువకుడు**


హరి మృతదేహం

చేగుంట(తూప్రాన్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కరీంనగర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వడ్డె రాములు కుటుంబీకులు రాయి కొట్టే పని చేస్తూ జీవిస్తున్నారు. సోమవారం రాములు కుమారుడు హరి(21) సోమవారం ప్రభుత్వ పాఠశాల పక్కనే ఉన్న హైటెన్షన్ టవర్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతుడి తండ్రి రాములు కుమారుడి ఆత్మహత్యపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

**అప్పుల బాధతో చెరువులో దూకి యువకుడు..**


సురేశ్ మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్): చెరువులో దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. చిన్నశంకరంపేట ఎస్‌ఐ నారాయణగౌడ్ కథనం మేరకు.. గవ్వలపల్లి గ్రామానికి చెందిన లింగాపుర శంకరయ్య కుమారుడు సురేశ్(30) గ్రామంలో వ్యవసాయంతోపాటు కూలీ పనులు చేస్తుంటాడు. అప్పులు కావడంతో తీర్చేందుకు మార్గంలేక ఉన్న ఎకరంన్నర పొలంలో కొంత అమ్ముదామని నిర్ణయించుకున్నాడు. కానీ భూమి కొనేందుకు ఎవరూ దొరకలేదు. గ్రామంలో కూడా ఎవరూ ముందుకు రాలేదు. ఇదే విషయంపై ఇంట్లో గొడవలు జరిగాయి. దీంతో మనస్తాపానికి గురైన సురేశ్ సోమవారం మధ్యాహ్నం స్థానిక చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య శ్రీజన్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

### ఆర్థిక ఇబ్బందులతో యువకుడు


నరేశ్ గౌడ్ (ఫైల్)

తొగుట(దుబ్బాక): ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవికాంత్‌రావు కథనం మేరకు.. గ్రామానికి చెందిన చిలువేరి నరేశ్ గౌడ్(30) తల్లిదండ్రులు లక్ష్మి, వెంకట్ గౌడ్ అనారోగ్యం (పక్షపాతం)తో కొన్నేళ్లుగా బాధపడుతున్నారు. తల్లిదండ్రులు మంచం పట్టడంతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. ఆస్పత్రిలో చికిత్స చేయించేందుకు, కుటుంబం అవసరాల కోసం అప్పులు చేశాడు. అవి తీర్చే మార్గంలేక మద్యానికి బానిసై పనిపాట లేకుండా తిరుగుతున్నాడు. దీంతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. ఈ క్రమంలో తీవ్ర మనోవేదనకు గురై నరేశ్ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి వెంకట్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.


లింగయ్యతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

### పొన్నంకు కృతజ్ఞతలు తెలిపిన గల్ఫ్ బాధితుడు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ పట్టణానికి చెందిన చొప్పరి లింగయ్య ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లాడు. అక్కడ అనారోగ్యంతో పని చేయలేక స్వదేశం రావడానికి చేతిలో డబ్బులు లేక అక్కడే ఉండిపోయాడు. స్వదేశానికి రావడానికి మంత్రి పొన్నం ప్రభాకర్ సహాయం చేయాలని కోరాడు. స్పందించిన మంత్రి టికెట్‌కు డబ్బులు ఇచ్చి ఎన్‌ఆర్‌ఐ అడ్వైజర్ కమిటీ చైర్మన్ వినోద్‌కుమార్‌ను లింగయ్య దగ్గర పంపించి భరోసా కల్పించి ఇంటికి పంపించాడు. సోమవారం మంత్రిని క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపాడు.

### చెక్‌డ్యాం ధ్వంసం చేశారని రైతుల ఆందోళన

బెజ్జంకి(సిద్దిపేట) : శనిగరం ప్రాజెక్టు నుంచి ముత్తన్నపేట, దాచారం గ్రామాలకు సాగు నీరు వచ్చే కాల్వ చెక్‌డ్యాం ధ్వంసం చేయడంపై ఆగ్రహించిన ముత్తన్నపేట రైతులు సోమవారం నర్సింహుపల్లె శివారులోని వైట్ ఫీల్డ్ ఇథనాల్ ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేశారు. వ్యర్థ జలాలు కాల్వలోకి వదలడానికి కంపెనీ వారే కాల్వ, చెక్ డ్యాంలు ధ్వంసం చేశారని ఆరోపించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రైతులను సముదాయించి సమస్య ఉంటే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కాల్వ నీటిని కాలుష్యం చేసేలా వ్యవహరిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవలని డిమాండ్ చేసి రైతులు వెనుదిరిగి వెళ్లారు.


ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

# మేలుకో.. ధ్రువపత్రం ముందే తీసుకో

## సెలవులని ఆలస్యం చేయొద్దు

• విద్యార్థులకు ఇదే సరైన సమయం
• సెలవులు ముగిస్తే మీ సేవా కేంద్రాల వద్ద పెరగనున్న రద్దీ
• ధ్రువపత్రాల జారీలో ఆలస్యం అయ్యే అవకాశం
• ముందే జాగ్రత్త పడితే మేలు

మెదక్ కలెక్టరేట్: విద్యార్థులు ఉన్నత తరగతుల్లో చేరేందుకు ప్రభుత్వం నుంచి కావాల్సిన ధ్రువ పత్రాలు పొందడానికి ఇదే మంచి సమయం. వేసవి సెలవులు ముగియగానే విద్యార్థులందరూ ఒకేసారి సర్టిఫికెట్ల కోసం మీసేవల వద్దకు గుమిగూడుతారు. పెద్ద ఎత్తున దరఖాస్తులు రావడంతో మీ సేవలో దరఖాస్తుల ప్రక్రియ ఆలస్యమవుతుంది. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో ప్రతీ దరఖాస్తు పరిశీలించడంతో ధ్రువపత్రాల జారీ జాప్యం జరుగుతుంది. దీంతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని వేసవి సెలవుల్లోనే నూతన విద్యా సంవత్సరానికి కావాల్సిన ధ్రువ పత్రాల కోసం దరఖాస్తు చేసుకొని తీసుకోవడం ఉత్తమం.

**ప్రతీ విద్యార్థికి అవసరం**

విద్యార్థులకు ఇతర పాఠశాలలకు వెళ్లేందుకు, స్కాలర్‌షిప్‌లకు, సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో చేరేందుకు కుల, ఆదాయ, స్థానిక ధ్రువపత్రాలు తప్పనిసరి. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు 1 నుంచి 10 తరగతుల విద్యార్హత సర్టిఫికెట్లు, కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు. ఇంటర్, డిగ్రీ పూర్తయిన విద్యార్థులకు కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలతోపాటు విద్యాపరంగా గ్యాప్ ఉంటే దానికి సంబంధించి తహసీల్దార్ జారీ చేసే పత్రం అవసరం ఉంటుంది. ఇందుకోసం విద్యార్థులు తమ పరిధిలోని ఠాణా నుంచి పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఆదాయ, నివాస ధ్రువపత్రాలను అవసరం మేరకు ప్రతీ సంవత్సరం తీసుకోవాల్సి వస్తుంది. 22న ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. త్వరలో పదో తరగతి ఫలితాలు రానున్నాయి. విద్యార్థులు పై చదువులు చదవడానికి విద్యార్హత పత్రాలతోపాటు కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు తప్పనిసరిగా అవసరం ఉంటుంది.

**దరఖాస్తు ఇలా చేసుకోవచ్చు**

కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాల కోసం మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. తల్లిదండ్రులకు సంబంధించిన ఆధార్, రేషన్‌కార్డులతోపాటు బోనఫైడ్‌లు, ఫొటోలు జత చేయాలి. ఆర్థికంగా వెనుకబడిన (ఈడబ్ల్యూఎస్) విద్యార్థులు ఆధార్, రేషన్‌కార్డుతోపాటు న్యాయవాది అఫిడవిట్, ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల హామీ పత్రాలు జత చేయాల్సి ఉంటుంది. ఈ విద్యార్థుల కుటుంబాలకు 100 చదరపు అడుగుల స్థలం కూడా ఉండకూడదు. మండల రెవెన్యూ అధికారి, ఉప తహసీల్దార్ క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారు. అనంతరం దరఖాస్తును ఆన్‌లైన్ ద్వారా రిపోర్టును తహసీల్దార్ లాగిన్‌కు చేరవేస్తారు. అన్ని పత్రాలను తహసీల్దార్ పరిశీలించి సక్రమంగా ఉంటే డిజిటల్ సంతకం చేస్తారు. అనంతరం సంబంధిత విద్యార్థి దరఖాస్తు ఫారమ్‌లో ఇచ్చిన ఫోన్ నంబర్‌కు మెసేజ్ పంపిస్తారు. మెసేజ్ వచ్చిన వెంటనే మీ సేవా ద్వారా విద్యార్థులు ధ్రువ పత్రాలను పొందవచ్చు.

| ఇటీవల పరీక్షలు రాసిన విద్యార్థులు | |
|---|---|
| ప్రాథమిక పాఠశాలలు | 63,877 |
| పదో తరగతి | 10,388 |
| ఇంటర్ ఫస్ట్ ఇయర్ | 6,153 |
| సెకండియర్ | 5,572 |
| మొత్తం | 85,990 |



మీ సేవ కేంద్రం

**రెండు రోజుల్లో అందిస్తాం**

మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల్లోనే ధ్రువపత్రాలు అందిస్తాం. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందుగానే దరఖాస్తు చేసుకుంటే ఇబ్బందులు ఉండవు. ప్రస్తుతం రెండు రోజుల్లోనే ధ్రువపత్రాలు అందిస్తున్నాం. అత్యవసరమైతే తక్షణమే ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

– లక్ష్మణ్‌బాబు, తహసీల్దార్, మెదక్

## క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్

**మెదక్ ఎంపీ రఘునందన్ రావు**


మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్ రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): క్రీడల్లో రాణించే వారికి బంగారు భవిష్యత్ ఉంటుందని మెదక్ పార్లమెంట్ సభ్యులు ఎం.రఘునందన్ రావు అన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో జరుగుతున్న జాతీయస్థాయి కలరిపయట్టు క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రాచీన క్రీడలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కేరళలో పుట్టిన కలరిపయట్టు క్రీడకు మూడు వేల సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. ఇప్పటికీ అనేక మంది ఈ క్రీడల్లో రాణిస్తున్నారని తెలిపారు. చిన్ననాటి నుంచే ఈ క్రీడలో శిక్షణ అందిస్తే ఎంతో రాణిస్తారని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

## మెరుగైన వైద్య సేవలతోనే గుర్తింపు

**కేఎన్ఆర్ యూహెచ్ఎస్ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్.నంద కుమార్‌రెడ్డి**


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నందకుమార్‌రెడ్డి

ములుగు(గజ్వేల్) : గ్రామీణ పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించినప్పుడే వైద్యులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని కేఎన్ఆర్ యూహెచ్ఎస్ వైస్ ఛాన్సలర్ డాక్టర్. నందకుమార్‌రెడ్డి అన్నారు. ములుగు మండలం లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం మెడికల్ కళాశాలలో చైర్మన్ డాక్టర్. యాకయ్య అధ్యక్షతన జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వైద్య విద్య గ్రాడ్యుయేషన్‌తో నూతన సాంకేతికతను అందిపుచ్చుకుంటూ పరిశోధన, ఉత్తమ పద్ధతి, పురోగతితో జ్ఞానం, నైపుణ్యత పెంచుకోవడానికి దోహదపడుతుందన్నారు. గ్రాడ్యుయేట్ వైద్యులు నిత్య విద్యార్థిగా భావిస్తూ ఆరోగ్య నిపుణుల సలహాలను స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ రంజిత్‌రెడ్డి, సీతఈఓ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## అవగాహన ఒప్పందంపై సంతకాలు


ఒప్పంద పత్రాలను చూపుతున్న అధికారులు

ములుగు(గజ్వేల్) : ములుగు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వ విద్యాలయం, హైదరాబాద్‌కు చెందిన శ్రీ ఫౌండేషన్ మధ్య సోమవారం పరస్పర సహకార ఒప్పందం కుదుర్చుకున్నారు. ములుగు విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్. దండా రాజిరెడ్డి, శ్రీ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్‌రావు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. తెలంగాణలోని రైతులు, మహిళలు, యువతకు వినూత్న శిక్షణ, సామర్థ్య నిర్మాణ కార్యక్రమాల ద్వారా శక్తివంతం చేయడంలో శ్రీ ఫౌండేషన్ దోహదపడుతుందన్నారు. అంతే కాకుండా ఈ ఒప్పందం ద్వారా ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టులు, ఆన్- ఫామ్ ట్రయల్స్, విస్తరణ కార్యకలాపాలను అమలు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు భగవాన్, లక్ష్మీనారాయణ, కుమార్, రాజశేఖర్, శ్రీనివాసన్ అనితాకుమారి, వీణాజోషి, తదితరులు పాల్గొన్నారు.

### తల్లీకూతురు అదృశ్యం


కీయా రాణా


కూతురు సేయా

పటాన్‌చెరు టౌన్: తల్లీకూతురు అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కోటేశ్వర్ రావు కథనం మేరకు.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన సమీర్ రాణా బతుకుదెరువు కోసం రెండు నెలల కిందట వచ్చి పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ మంజీరా స్కూల్ సమీపంలో ఉంటున్నాడు. ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 26న డ్యూటీకి వెళ్లిన సమీర్ రాణా రాత్రి ఇంటికి వచ్చి చూసేసరికి భార్య కీయా రాణా, కూతురు సేయా(6) కనిపించలేదు. స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య, కూతురి అదృశంపై భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

**నా భర్త ఆచూకీ తెలపండి**


మైలి శ్రీను

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని శమ్నాపూర్ గ్రామానికి చెందిన మైలి శ్రీను 16 నుంచి నుంచి కనిపించడం లేదని, తెలిస్తే ఆచూకీ తెలపాలని అతడి భార్య లత సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎవరైనా ఆచూకీ లభిస్తే హవేళి ఘణాపూర్ పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

## చికిత్స పొందుతూ బాలుడు మృతి

• వైద్యం వికటించడం వల్లే చనిపోయాడని కుటుంబీకుల ఆరోపణ
• మా తప్పేమీ లేదన్న వైద్యులు


బాలుడి వద్ద విలపిస్తున్న తల్లి

సిద్దిపేటజోన్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాలుడు సోమవారం మృతి చెందాడు. వైద్యం వికటించడం వల్లే బాలుడు చనిపోయాడని బాలుడు కుటుంబ సభ్యులు ఆరోపించారు. వివరాల్లోకి వెళ్తే.. దుబ్బాక పట్టణానికి చెందిన అనిల్, భవానీ దంపతుల 8 నెలల బాలుడు(నిహాన్)ను ఆదివారం సాయంత్రం పట్టణంలోని సంరక్ష పిల్లల ఆస్పత్రికి తీసుకొచ్చారు. బాలుడిని పరీక్షించిన వైద్యులు ఊపిరితిత్తుల్లో తెమడ(బ్రాంకిటిస్ న్యూమేనియా)గా గుర్తించి ఐసీయూలో చేర్పించి చికిత్స ప్రారంభించారు. సోమవారం ఉదయం బాలుడు మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు వైద్యం వికటించడం వల్లే బాబు చనిపోయాడని ఆరోపిస్తూ ఆస్పత్రి వైద్యులను నిలదీశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకొని వివరాలు సేకరించారు. సోమవారం తెల్లవారు జామున నర్స్ ఇంజెక్షన్ ఇచ్చిన తర్వాతే పల్స్ రేటు పడిపోయి బాబు చనిపోయాడని తల్లి భవానీ విలపిస్తూ పేర్కొంది. బ్రాంకిటిస్ న్యూమేనియాతో బాధపడుతున్న బాబుకు చికిత్స అందిస్తుండగా సోమవారం పరిస్థితి విషమంగా మారింది. శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది ఉండగా సీపీఆర్ ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం దక్కలేదని, ఇందులో మా తప్పు ఏమీ లేదని ఆస్పత్రి వైద్యులు పేర్కొన్నారు.